## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతకాని, డిసెంబర్ 15: నాగులవంచ, పందిళ్లపల్లి 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి లోని గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అన్నారపు ఉమామహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ కనెక్షన్లకు, గృహవినియోగదారులకు ఫీడర్ మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

## శివాలయం అర్చకుడి మృతి

చింతకాని, డిసెంబర్ 15: నేరడ శివాయం ప్రధానార్చకుడు ఇంగువ విష్ణువర్ధన్(80) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైస్‌ఎంపీపీ గురజాల హనుమంతరావు, బీఆర్‌ఎస్ నాయకులు మంకెన రమేశ్, కొల్లి వెంకయ్య, వెంకటప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు విష్ణువర్ధన్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతుడు 60 ఏళ్లుగా శివాలయం ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నారు.

## మానసిక దివ్యాంగులకు దుస్తులు అందజేత

మధిర, డిసెంబర్15: మానసిక దివ్యాంగ పిల్లలకు మధిర పట్టణానికి చెందిన నాళ్ల శ్రీనివాసరావు తమ తండ్రి నాళ్ల వెంకటరామారావు జ్ఞాపకార్థం మధిరలోని మదర్‌థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో మానసిక దివ్యాంగుల పిల్లలకు ఉన్ని దుప్పట్లను శుక్రవారం అందజేశారు. దుప్పట్లు అందించినందుకు సేవాసదనం ప్రిన్సిపాల్ నల్లపు స్వర్ణలత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాళ్ల శ్రీనివాసరావు, కొరగంటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో సాంకేతికత జోడించాలి : డీఈవో

చింతకాని, డిసెంబర్ 15: విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఉన్నతి, ఎఫ్‌ఎల్‌ఎన్ తదితర బోధనాంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన జరపాలని, విద్యలో సాంకేతికత జోడిస్తూ విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి అమలుపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మౌలిక భాషా గణిత సామర్థ్యాలను ప్రతి ఉపాధ్యాయులు తరగతి గదిలో పాటించాలని, విద్యార్థుల ప్రగతి రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్నారులు ఆంగ్లంపై పట్టు సాధించేలా కృషిచేయాలన్నారు. 'మన ఊరు–మనబడి' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయని, విద్యార్థులకు సన్నబియ్యం, రాగిజావ, ఉదయం అల్పాహారం, వారానికి మూడు గుడ్లతో నాణ్యమైన భోజనంతో పాటు శారీరక, మానసిక అంశాల వారీగా బోధన ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, వంట సిబ్బందికి వేతనాలు ఎప్పటికప్పుడు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మోదుగు శ్యాంసన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఎన్‌వో శ్రీనివాసరావు, జిల్లా సెక్టోరియల్ అధికారులు భానుప్రకాశ్, వై రాజశేఖర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

# పోలీసు సిబ్బందికి సీపీ 'బడాఖానా'

ఖమ్మం, డిసెంబర్ 15: నిరంతరం విధుల్లో తలమునకలయ్యే పోలీసు సిబ్బందిలో కాస్తంత ఆనందం కలిగించేందుకు సీపీ విష్ణు శుక్రవారం బాడాఖానా (మధ్యాహ్న భోజనం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పకడ్బందీ ప్రణాళిక, సమష్టి కృషి, సమన్వయంతో అసెంబ్లీ ఎన్నికలు విజయవంతం చేసిన పోలీసు సిబ్బందిలో కాస్తంత ఊరట కోసం ఈ బడాఖానాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం ద్వారా సిబ్బందిలో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రజల రక్షణ కోసం ఆటుపోట్లను చవిచూస్తూ కుటుంబాలను వదిలి నిరంతరం విధుల్లో ఉండే పోలీసులకు ఇదొక ఆనందపు ఘడియ కావాలని ఆకాంక్షించారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది తమ కష్టాలను మరిచి పరస్పరం ఆప్యాయతలు, పలకరింపులతో ఆనందాన్ని పంచుకున్నారు.



మాట్లాడుతున్న సీపీ విష్ణు ఎస్ వారియర్

## రైల్వేగేటు వద్ద తప్పిన పెనుప్రమాదం



ప్రమాద స్థలంవద్ద లారీ, ద్విచక్ర వాహనం

బోనకల్లు, డిసెంబర్15: గోవిందాపురం–ఏ గ్రామంలోని రైల్వేగేటు వద్ద పెనుప్రమాదం తప్పిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. మధిర నుంచి కంకర లోడ్‌తో వస్తున్న లారీ రైల్వే గేటు మూసి ఉండటంతో డ్రైవర్ లారీ నిలిపివేశాడు. రైల్వేగేటు తీసిన వెంటనే వెళ్లాల్సి ఉండగా లారీ ముందుకు వెళ్లేక్రమంలో అదుపు తప్పి వెనక్కు రావడంతో ప్రమాదం చోటు చేసుకున్నది. అధిక లోడ్‌తో ఉన్న లారీ వెనుక ఉన్న వాహనదారులు తమ వాహనాలను వదిలేసి పరుగులు తీశారు. లారీ బైక్ పై నుంచి వెళ్లడంతో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది.అధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో వస్తున్న లారీడ్రైవర్లకు, రైల్వే కాంట్రాక్టర్లకు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

ముదిగొండ, డిసెంబర్ 15: వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని ఏపీజీవీబీ ముదిగొండ బ్రాంచ్ మేనేజర్ రవిచంద్ర తెలిపారు. బ్యాంకులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. రుణమాఫీ వర్తించని రైతులందరూ రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెన్యూవల్ చేయించుకుంటే మాఫీ రాదనేది అపోహ మాత్రమేనని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తిరుమలాయపాలెం, డిసెంబర్ 15: తిరుమలాయపాలెం గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలో పీజీటీ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ పోస్టుకు తాత్కాలిక ప్రాతిపాదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ పుల్లయ్య శుక్రవాకం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆర్‌సీఏ కార్యాలయం ఐటీడీఏ భద్రాచలంలో ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులను డెమో ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు.

## ర్యాగింగ్ దుష్ట సంప్రదాయం : డీఎస్పీ

పాల్వంచ, డిసెంబర్ 15 : పాశ్చాత్య సంస్కృతి నుంచి దిగుమతి చేసుకున్న దుష్ట సంప్రదాయం ర్యాగింగ్ అని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు సహాయం చేయాలే కానీ ర్యాగింగ్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో షీటీం ఎస్సై రమాదేవి, ఏయూటీహెచ్ వీశ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు వైద్యపరీక్షలు

ఎర్రుపాలెం, డిసెంబర్15: మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణుల ఇళ్లకెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రసవానికి బనిగండ్లపాడు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని, సుఖప్రసవాలు చేస్తామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే ఆపరేషన్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీనివల్ల ఆర్థికభారంతో పాటు, అనారోగ్య సమస్యలతో కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర జే వెంకటేశ్వరరావు, హెల్త్‌అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం స్నేహ, ఆశకార్యకర్తలు విజయ, రమణ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పుష్పలత

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మధిరరూరల్, డిసెంబర్ 15: ప్రతివ్యక్తి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ నిడమానూరి సంధ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలుకూరు గ్రామం బీసీకాలనీలో చిరువ్యాధులకు ప్రథమ చికిత్స శిబిరాన్ని దెందుకూరు పీహెచ్‌సీ పారామెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పద్మావతి, హెచ్‌వీ కౌశల్య, హెచ్‌ఎస్ లంకా కొండయ్య, ఏఎన్‌ఎంలు వీ విజయకుమారి, భారతి, వై లక్ష్మి, లీలా, అరుణ, రాజేశ్వరి, విజయకుమారి, విజయలక్ష్మి, సునీలారాణి, నాగమణి, గ్రామసెక్రటరీ మాధవి, హెచ్‌ఏలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఐకేపీ, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పనులను అడ్డుకున్న దళితులు

తిరుమలాయపాలెం, డిసెంబర్ 15: మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో సమీపంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు కాల్వ తవ్వకం పనులను శుక్రవారం దళితులు అడ్డుకున్నారు. తాము కోల్పోయిన భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళితులు పోలెపొంగు ఉప్పలయ్య, నాగయ్య, రాములు, సంగెపొంగు పుల్లయ్య, ఉప్పలయ్య మాట్లాడుతూ తిప్పారెడ్డిగూడెం రెవెన్యూలోని 148 సర్వేనెంబర్లో 14 ఎకరాల భూమిని ప్రభుత్వం తమ కుటుంబ సభ్యులు 12 మందికి అసైన్డ్ పట్టాలు ఇచ్చిందన్నారు. అట్టి భూమిని అగ్రకులాల వారు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. ఆ భూమి ఇటీవల సీతారామ ప్రాజెక్టు కాల్వ తవ్వకానికి పోయిందన్నారు. కోల్పోయిన భూములకు తమకు పరిహారం చెల్లించాలని ఉన్నతాధికారులకు విన్నపించుకున్న ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపధ్యంలో తాము పరిహారం చెల్లించేవరకు ప్రాజెక్టు పనులను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



కాల్వ పనులను అడ్డుకుంటున్న దళితులు

# అధ్యాపకుల ఘర్షణపై డీఐఈవో విచారణ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 15: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా ఇద్దరు అధ్యాపకుల మధ్య జరుగుతున్న ఘర్షణపై శుక్రవారం డీఐఈవో రవిబాబు విచారణ చేపట్టారు. తొలుత ప్రిన్సిపాల్ చాంబర్‌లో అధ్యాపకురాలు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, మిగిలిన అధ్యాపకులతో విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. కళాశాలలో మహిళా అధ్యాపకులను వేధింపులకు గురిచేసిన అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు సైతం డీఐఈవోకు విన్నవించాయి. విచారణకు హాజరుకాని అధ్యాపకుడు వేణు నుంచి వివరణ తీసుకున్నారు. కాగా, ఇద్దరు అధ్యాపకులకూ ప్రిన్సిపాల్ మెమోలు జారీ చేశారు. అనంతరం, మహిళా అధ్యాపకురాలు తాను ఎదుర్కొన్న వేధింపులపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు.



విచారణ చేస్తున్న డీఐఈవో రవిబాబు

## విప్లవకారులు ఏకమవ్వాలి

### ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 15 : దేశంలో వివిధ రంగాల్లో పెనుమార్పులు వస్తున్నాయని, మారిన పరిస్థితులను అర్థం చేసుకొని విప్లవ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో నిర్వహించిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఎంఎల్ ఆర్ఐ పీసీసీ, సీపీఐ(ఎంఎల్) జిల్లా సదస్సులో మాట్లాడారు. కాలం చెల్లిన విధానాలతోప్రజలకు దూరమవుతామని హెచ్చరించారు. కేంద్రం అనుసరిస్తున్న వ్యవసాయ, యువజన, రైతు, మహిళా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, కెచ్చెల రంగారెడ్డి, ముద్దా భిక్షం, మాచర్ల సత్యం, కెచ్చెల కల్పన, జాటోతు కృష్ణ పాల్గొన్నారు.

## గోశాలకు గేదెల తరలింపు

పాల్వంచ, డిసెంబర్ 15 : ఛత్తీస్‌గఢ్ నుంచి మోరంపల్లి బంజర్‌కు ఆరు గేదెలతో వెళ్తున్న వాహనాన్ని భద్రాచలం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వాటిని పాల్వంచ అన్నపూర్ణ గో సంరక్షణ సమితికి పంపించారు. గేదెలను గోశాల నిర్వాహకులకు అప్పగించినట్లు కార్యదర్శి ఆంజనేయశర్మ తెలిపారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

వైరారూరల్, డిసెంబర్15 : వృద్ధులకు లయన్స్‌క్లబ్ వారు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. గొల్లపూడి వృద్ధాశ్రమంలో పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మీటింగ్ షెడ్డులో ఆశ్రమ నిర్వాహకులు కోరిక మేరకు చెరుకూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమార్తె అల్లుడు కాపా వరలక్ష్మి, వీరభద్రరావు కుమారుడు హరికృష్ణ ఆర్థిక సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి గేటు వితరణ

పాల్వంచ, డిసెంబర్ 15 : పాత పాల్వంచలోని అంగన్‌వాడీ కేంద్రానికి జీఎస్ ఫంక్షన్‌హాల్ అధినేత, వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాశ్ రాజ్యలక్ష్మి, సాయి లిఖిత్ శుక్రవారం గేటును వితరణ చేశారు. గేటు లేకపోవడంతో పశువులు లోనికి వస్తున్నాయని, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని అంగన్‌వాడీ టీచర్ మంజుల విజ్ఞప్తి మేరకు గేటును అందించారు.